'భరోసా'..నిరాశ

- కొత్త జాబ్ కార్డులు ఇచ్చేదెన్నడో?
- ఆత్మీయ భరోసా అందేదెన్నడో?
- ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- దరఖాస్తుదారుల్లో సన్నగిల్లుతున్న ఆశలు

కలెక్టరేట్, మే 11: ఉపాధి కూలీల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయం. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న మాదిరిగానే, ఉపాధి కూలీలకు కూడా నెలనెలా ఆర్థిక సాయం అందించి, ఆత్మీయ భరోసా కల్పిస్తాం. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటామంటూ.. కొద్ది నెలల క్రితం అధికార నేతలు ఆర్భాటంగా ప్రకటన చేశారు. దీంతో, అందరితోపాటు మాకు తమకు సాయమందుతుందని ఉపాధి కూలీలు సంబురపడ్డారు. ఈ ప్రకటన చేసి నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు ఆదిశగా చర్యలు చేపట్టిన ఊసేలేదు. వారికి ఆత్మీయ భరోసా అందించే ప్రయత్నమూ లేదు. కొత్త కార్డులపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన లేదు. జాబ్‌కార్డుల సైట్ తెరిచేందుకు ముహూర్తం ఖరారు చేయకపోవడంతో, కార్డుల మంజూరీపై తమకు ఆశలు సన్నగిల్లుతున్నాయని కూలీలు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ, భూమి లేని కూలీలకు కూడా ఆర్థిక సాయమందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. ఉపాధి పనులకు హాజరయ్యే రోజుల ఆధారంగా, ఈ పథకానికి ఎంపిక చేస్తుండగా, భూమి లేని నిరుపేదలంతా, ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. జాబ్‌కార్డులు పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2022-23 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని పేదలకు భరోసా వర్తింపజేస్తున్నారు. ఆ ఏడాదిలో జాబ్‌కార్డుల్లేని వారిలో కొద్దిమందికి కొత్తగా పంపిణీ కూడా చేశారు. దీంతో, మాకు కూడా కార్డు లొస్తాయనే ఆశతో దరఖాస్తులు చేసుకున్న వారికి నిరాశే ఎదురైంది. జాబ్‌కార్డుల దరఖాస్తు సైట్ మూసివేయగా, ఇప్పటివరకు తిరిగి తెరుచుకోలేదు. ఆత్మీయ భరోసా అందాలంటే ఉపాధి పనులు చేయాల్సిందే. ఉపాధి పనులకు వెళ్లాలంటే జాబ్‌కార్డు విధిగా ఉండాల్సిందే. ఈ పథకంపై ప్రకటన వెలువరించిన అనంతర కాలం నుంచి ఆన్‌లైన్‌లో కొత్త జాబ్‌కార్డుల దరఖాస్తుల ఆప్షన్ రాక, జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు వెళ్లలేకపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పొలాలన్ని పొట్ట, కోత దశల్లో ఉండడంతో, పనులు తగ్గాయి. ఈ దశలో వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల వైపే దృష్టిసారిస్తుంటారు. కొత్త జాబ్‌కార్డుల మంజూరు ప్రస్తుతానికి లేకపోగా, తిరిగి ఎప్పుడు అవకాశం కల్పిస్తారో తెలియక కూలీలంతా ఆందోళన చెందుతున్నారు. పనులు కరువై కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండగా, మరికొందరు ఇళ్లవద్దే ఉంటూ ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్తగా జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

సైట్ తెరవగానే కార్డుల మంజూరు

ప్రస్తుతం కొత్త జాబ్‌కార్డుల మంజూరుకు అవకాశం లేదు. దీనికి సంబంధించిన ఆప్షన్ ప్రస్తుతం నిలిపివేశారు. తిరిగి జాబ్‌కార్డుల సైట్ తెరవగానే, దరఖాస్తులు చేసుకున్న కూలీలకు కార్డులు అందజేస్తాం.

- శ్రీధర్, డీఆర్‌డీవో, కరీంనగర్

స్నేహితురాలి పెండ్లికొచ్చి..
అనంతలోకానికి..

- కారు ఢీకొని మహిళ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

చిగురుమామిడి, మే 11: స్నేహితురాలి వివాహానికి వచ్చి.. అనంతరం వెళ్లేందుకు రోడ్డు పక్కన ఉన్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌కు చెందిన నీలం మౌనిక(24) సుందరగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తన స్నేహితురాలి చెల్లె వివాహానికి హాజరైంది. అనంతరం గ్రామ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో విందు ఏర్పాటు చేయగా, అక్కడ భోజనం చేసింది. తర్వాత తిరిగి ఇంటికి వెళ్లేందుకు గానూ ఫంక్షన్‌హాల్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నది. ఈ క్రమంలో హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు మౌనికను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న మరో స్నేహితుడు గోదావరిఖనికి చెందిన సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎస్ఐ చందబోయిన శ్రీనివాస్, ట్రెయినీ ఎస్ఐ జగదీశ్వర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మౌనిక తండ్రి నీలం నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ రైతు మృతి

గన్నేరువరం, మే 11: పారువెల్ల గ్రామ శివారు దుబ్బపల్లె గ్రామానికి చెందిన ఏలేటి ముత్యంరెడ్డి(63) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణంతో గత శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. ముత్యంరెడ్డి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రెయినీ ఎస్ఐ అరుణ్ తెలిపారు.

గైనకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పద్మలత

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పద్మలతతో వైద్యులు

కరీంనగర్ విద్యానగర్, మే 11: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గైనకాలజిస్ట్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షురాలిగా వేములవాడ పార్థసారధి నర్సింగ్ హోమ్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ నాగమల్ల పద్మలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని వీ పార్క్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా గైనకాలజిస్ట్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హైదరాబాద్ యశోద దవాఖాన స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ జమునాదేవి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కరీంనగర్ సౌమ్య హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ స్రవంతి ప్రధాన కార్యదర్శిగా, కరీంనగర్ కేఎస్‌వీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ స్వప్న కోశాధికారిగా ఎన్నికయ్యారు. తన నియమాకానికి సహకరించిన డాక్టర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ వైద్యులు శోభారాణి, లీలా శిరీష, సింధు, గీతావాణి, నయని, పద్మిని, తాత్విక, గీత, విజయలక్ష్మి ఉన్నారు.

ట్రోఫీతో విజేతగా నిలిచిన విజయ్ బుల్స్ (అల్గునూర్) జట్టు

అమ్మమ్మ ప్రీమియర్ లీగ్ విజేతగా విజయ్ బుల్స్ జట్టు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మే 11: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లిలో ఆదివారం నిర్వహించిన అమ్మమ్మ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-1 విజేతగా విజయ్ బుల్స్ (అలుగునూర్) జట్టు నిలిచింది. పడాల కనకవ్వ జ్ఞాపకార్థం 36రోజులు సాగిన ఈ టోర్నమెంట్‌కి స్పాన్సర్ గా బుర్ర విజయ్ గౌడ్ వ్యవహరించారు. ఫైనల్ మ్యాచ్‌లో గునుకుల కొండాపూర్‌పై కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూర్ విజయం సాధించింది. కేవలం అమ్మమ్మ మీద ఉన్న ప్రేమకు నిదర్శనమే ఈ టోర్నమెంట్ అని విజయ్ గౌడ్ అన్నారు. అమ్మమ్మ ఆశీర్వాద బలంతో ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చి మ్యాన్ ఆఫ్‌ది సీరీస్‌గా ఎంపికయ్యానన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఆర్గనైజర్లుగా సంతోష్ యాదవ్, లక్ష్మణ్‌రెడ్డి వ్యవహరించారన్నారు. విజేత అలుగునూర్ జట్టుకు ట్రోఫీతో పాటు నగదు రూ.20వేలు, రన్నరప్ గునుకుల కొండాపూర్‌కు రూ.10వేలు, మూడో స్థానంలో నిలిచిన దేవక్కపల్లికి కప్‌తోపాటు రూ.5వేలు స్పాన్సర్ బుర్ర విజయ్‌గౌడ్ అందజేశారు. ఇక్కడ మహిపాల్ రెడ్డి, సంపత్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పడాల సత్యనారాయణ, పడాల వెంకటపతి, పడాల అశోక్, వరుణ్, శరత్, మహేష్, మహేశ్ చంద్ర, బిన్ను, అనిల్, వంశీ, చందు, మణి జ్యోతిక్, రాకేశ్, అజయ్ ఉన్నారు.

వేసవి శిక్షణ.. భవితకు రక్షణ

డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

- బాలభవన్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రత్యేక తరగతులు
- సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు

కమాన్‌చౌరస్తా, మే 11: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌తోపాటు, పలు ప్రైవేట్ విద్యా సంస్థలు వేసవిలో చిన్నారులకు భవిష్యత్‌లో ఉపయోగపడేలా పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి బాలభవన్‌లో శిక్షణ ఇస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో పలు ప్రైవేట్ విద్యాసంస్థల భాగస్వామ్యంలో చదువుకు ఉపయోగపడే అంశాలతో పాటు, క్రీడలు, స్విమ్మింగ్‌పై శిక్షణ అందిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాలభవన్ ద్వారా శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభంకాగా, చిన్నారులు ఆసక్తి చూపిస్తున్నారు. బాలభవన్‌లో ఎస్ కృష్ణకుమార్ పర్యవేక్షణలో చిత్రలేఖనం, కే మంజులాదేవి శిక్షణలో గాత్ర సంగీతం, మాస్టర్ శ్రీధర్ నేతృత్వంలో మృదంగం, డాన్స్ మాస్టర్ సంగెం రాధకృష్ణ నృత్యంలో, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో సూర్యలో శ్రీ శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు యోగా, అబాకస్, చెస్, బ్యూటీషియన్, హ్యాండ్ రైటింగ్, టైలరింగ్, కర్రసాము విభాగాల్లో నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే దాదాపు 400మంది విద్యార్థులు తమపేర్లు నమోదు చేసుకున్నారు. ఈ తరగతులు ఏప్రిల్ 24న ప్రారంభం కాగా, జూన్ 10వరకు ఉంటాయని బాలభవన్ సూపరింటెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా అంబేద్కర్ స్టేడియంలోని తమ ఆఫీస్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం 5నుంచి 16 సంవత్సరాల లోపు విద్యార్థులు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో సమర్పించిన పేర్లు నమోదు చేసుకోవలని సూచించారు. ఈ శిక్షణ ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12గంట వరకు ఉంటుందన్నారు.

ప్రైవేట్ భాగస్వామ్యంతో..

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవతో విద్యార్థులకు పలు అంశాలలో వేసవిలో శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్‌లోని బాలభవన్‌తోపాటు అంబేద్కర్ స్టేడియం, సప్తగిరి కాలనీలోని కేజీబీవీ స్కూల్, మంకమ్మతోటలోని గర్ల్స్ హైస్కూల్‌తోపాటు పది పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో స్విమ్మింగ్, స్పెల్‌బీ, క్రియేటివ్ రైటింగ్, అబాకస్, వాలీబాల్, బుక్ రివ్యూ, యాక్టింగ్, పెయింటింగ్, క్విజ్, డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్, బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఫొటోషాప్‌తో పాటు మొత్తం 27అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి వేసవిలో ప్రభుత్వ సహకారంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. శిబిరంలో ప్రత్యేక అంశాలతో శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కలెక్టర్ సమక్షంలో సర్టిఫికెట్లు అందిస్తాం. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అనుభవాలను విద్యార్థులు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కూడా సాయంత్రం సమయంలో శిక్షణకు హాజరయ్యే అవకాశం ఉన్నది.

- మంజులాదేవి, బాలభవన్ నిర్వాహకురాలు

ఉత్తమ విద్యతోనే సార్థకత

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

సమ్మేళనంలో మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మే 11: ఉత్తమ విద్యతోనే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని బూరుగుపల్లి వివేక వర్ధిని పాఠశాలలో పూర్వ విద్యార్థుల (2008-09లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే రవిశంకర్ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. పూర్వ విద్యార్థులను తమకు చవుదులు చెప్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతా కలిసిస సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటాపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

తండ్రికి కొరివిపెట్టిన
కూతురు

తాడికల్‌లో తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు ప్రవస్తి

శంకరపట్నం, మే 11: అనారోగ్యంతో మృతి చెందిన ఆ తండ్రికి కూతురు కొరివిపెట్టిన విషాదకర ఘటన శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. తాడికల్ గ్రామానికి చెందిన రౌతు లక్ష్మీనారాయణ- మమత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ప్రవస్తి(17), ప్రసస్తి(13) ఉన్నారు. లక్ష్మీనారాయణ (37) మూడేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. మమత పలు దవాఖానల్లో చికిత్స చేయించినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం కన్నుమూశాడు. పుట్టెడు దుఃఖంలో పెద్ద కూతురు ప్రవస్తికన్న తండ్రి చితికి కొరివిపెట్టింది. ఈ ఘటన గ్రామంలోని చూపరులను కంటతడి పెట్టించింది. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి దాతలు చేయూతని వ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

14న ఉద్యోగ మేళా

చొప్పదండి, మే11: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఈ నెల 14న బుధవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ క్రాంతికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన 750, ఆపైన మార్కులు (ఎంపీసీ, సీఈసీ, బైపీసీ ఒకేషనల్‌లో), సాధించిన విద్యార్థులు ఉద్యోగంతో పాటు డిగ్రీ చదివే అవకాశం కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం నంబర్లలో (6303207394/ 9000424 504) సంప్రదించాలని సూచించారు.

ఈఏపీ సెట్‌లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

తిమ్మాపూర్, మే11: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ప్రవేశానికి నిర్వహించిన ఈఏపీ సెట్‌లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థల్లో చదివిన 31మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. మరింత మందికి ర్యాంకులు రాగా, వారిని అల్గునూర్‌లోని క్యాంపస్‌లో అభినందించారు. విద్యార్థులు ప్రతిభ చూపి, విద్యాసంస్థలకు మరింత మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ చూపిన విద్యార్థులతోపాటు ర్యాంకులు రావడంలో కృషి చేసిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకుడు తిరుపతితో పాటు సిబ్బందని విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి అభినందించారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

గంగాధర, మే 11: గంగాధర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మధురానగర్ చౌరస్తాలో క్రీడాకారులకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరంలో పాల్గొంటున్న 65మంది క్రీడాకారులకు దాత సిరిపురం సమ్మరాజు టీషర్టులను పంపించగా, ఆదివారం శిక్షణ ఎస్ఐ స్వాతి చేతులమీదుగా అందజేశారు. టీ షర్టులు అందజేసిన సమ్మరాజుకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ క్రీడాకారులు పుట్కం ఠాగూర్, గంట విజయ్, కట్ల శ్రీనివాస్, గుజ్జెటి లవకుమార్, ఉపేందర్, వివేక్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వార్షిక మహాసభ

చిగురుమామిడి, మే 11: రేకొండలో రేకొండ పురుషుల పొదుపు సంఘం 23వ వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. సంవత్సరం కాలంగా చేపట్టిన పొదుపులు, అప్పులు, వార్షిక ఆదాయం గురించి వివరించారు. అనంతరం పొదుపు సంఘం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెంచల దిలీప్, ఉపాధ్యక్షుడిగా గొడిశాల శ్రీనివాస్ గౌడ్, పాలకవర్గ సభ్యులుగా పీరల్ల తిరుపతి, వేణు, కట్కోజుల రవీంద్రాచారి, పోగుల రవీందర్, అరిగెల రమేశ్, చెంచల సురేశ్, పందిపెళ్లి తిరుపతి, చెంచల నాగరాజు ఎన్నికయ్యారు. ఇక్కడ సైదాపూర్ సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్‌గౌడ్, ఎన్నికల అధికారి మడమల్కల రాజిరెడ్డి, సమితి గణకుడు అనుగోని వీరన్నగౌడ్, సంఘ గణకుడు బేరి హరీశ్ ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి, మే 11: పట్టణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఆదివారం అధికారులు సిరిపురం ఆనందం, పిట్టల లచ్చయ్య, తుమ్మ ఆనందం ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపెల్లి అంజయ్య గౌరవాధ్యక్షులుగా వాకర్స్ క్లబ్ ఫౌండర్ గుర్రం సంజీవరెడ్డి, వైద్యుల రాజిరెడ్డి ఉపాధ్యక్షులుగా యెలిగేటి సురేశ్, మహేశుని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా దండె లింగన్న, జాయింట్ సెక్రటరీగా దండె సత్యానందం, సిరిపురం తిరుపతి, మొలుమారి రమేశ్, కోశాధికారిగా దూస రాము, ప్రచార కార్యదర్శిగా బొద్దుల కిషన్, కార్యవర్గ సభ్యులుగా పిట్టల లచ్చయ్య, దుంపేటి వెంకటేశం, కాసం శ్రీనివాస్, మంచికట్ల విఠల్, సంబోజి రాజేష్, పోతు రాజు, తొడుపునూరి లక్ష్మయ్య, ముద్దం తిరుపతి, గుర్రం చంద్రారెడ్డి, యామ పోచమల్లయ్య, యెన్నం లహరి,బొల్లం సాంబమూర్తి, జహీర్, యెలిగేటి నాగరాజు, ముఖ్య సలహాదారులుగా గుర్రం హన్మంతరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, కొల్లూరి ఆనందం, కటుకం మల్లికార్జున్, వడ్లూరి లచ్చయ్య, పెరుమండ్ల గంగయ్య, సామల రాజు, చీకట్ల కుమార్ ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

గంగాధర, మే 11: కరీంనగర్ సన్‌రైజ్ దవాఖాన సౌజన్యంతో ఆదివారం గట్టు భూత్కూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. దవాఖాన సిబ్బందికి మాజీ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

కొడుకు లేడని తల్లడిల్లి

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్యాయత్నం
- ఆన్‌లైన్ గేమ్స్‌కు రెండు నెలల క్రితం కొడుకు బలి

తిమ్మాపూర్, మే11: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై రెండు నెలల కిందట ఎదిగిన కొడుకు ఆత్మహత్య చేసుకోగా.. తండ్రి ఆదివారం ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. మన్నెంపల్లికి చెందిన సిరికొండ తిరుపతిరావుకు ఒక్కడే కొడుకు నిఖిల్‌రావ్. ఆ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై అప్పులు చేసినా తండ్రి కట్టాడు. అయినా కొడుకు మార్చి 10న ఇందిరానగర్ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తండ్రి తిరుపతిరావు తీవ్ర మనోవేదన చెందుతున్నాడు. ఉన్న ఒక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడాన్ని జీర్ణించుకోలేక తల్లడిల్లుతున్నాడు. ఈ క్రమంలో కొడుకు దూకి ఆత్మహత్య చేసుకున్న బావి వద్దకు ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. అక్కడే గడ్డిమందు తాగి తన భార్యకు ఫోన్ చేశాడు. దీంతో ఆమె గ్రామస్తులతో కలిసి వచ్చి కరీంనగర్ దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు.

సీపీల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

చొప్పదండి, మే11: మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం వేసవిలో నిర్వహించే చొప్పదండి ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్‌ను ఇప్పనపెల్లి హరికిషన్ జడ్పీ క్రీడామైదానంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మాజీ కౌన్సిలర్లు, నేతలు ఆదివారం ప్రారంభించారు. దేశ భద్రతలో భాగంగా యుద్ధభూమిలో వీరమరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతిచేకూరాలని మౌనం పాటిస్తూ ఘన నివాళులర్పించారు.

నాటి గురువులతో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామడుగు, మే 11: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల (1995-96లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నాటి హెచ్ఎం వెంకటరెడ్డి, ఒకేషనల్ ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, రాజబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. తర్వాత గతస్మృతులను నెమరువేసుకున్నారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు బిమ్మరవేని తిరుపతి, ఆడెపు మనోజ్ కుమార్, శ్రీనివాస్, సంతోష్, బుని, కృష్ణ, ఆరిఫ్, శ్వేత, సుజాత, పద్మ ఉన్నారు.

జిల్లా విద్యార్థికి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు

సబ్బని లలిత్

కమాన్‌చౌరస్తా, మే 11: ఎఫ్‌సెట్ ఫలితాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన వైద్య దంపతులు డాక్టర్ ఎస్ కృష్ణమూర్తి-హిమబిందుల కుమారుడు సబ్బని లలిత్ 140.477 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. తాను నీట్‌కు ప్రిపేర్ అవుతున్నానని, రానున్న రోజులు వైద్య విద్య పూర్తి చేసి, వైద్య సేవ చేయాలన్నదే తన ముందున్న లక్ష్యమని లలిత్ చెప్పాడు. లలిత్ 8వ తరగతి వరకు కరీంనగర్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ శ్రీ చైతన్య జోనల్ క్యాంపస్‌లో పూర్తి చేశాడు.

గంప ప్రజ్ఞానికి ఫార్మసీలో 869వ ర్యాంక్

గంప ప్రజ్ఞాని

శంకరపట్నం, మే 11: కేశవపట్నం గ్రామానికి చెందిన గంప ప్రజ్ఞాని ఆదివారం వెలువడిన టీజీ ఈఏపీ సెట్-25 ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచింది. ప్రజ్ఞాని అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 90.159 మార్కులతో 869వ ర్యాంక్ సాధించి క్వాలీఫై అయింది. ప్రజ్ఞాని అలుగునూర్‌లోని సీవోఈలో బైపీసీ సెకండియర్ పూర్తి చేసింది. ఈఏపీ సెట్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడంతో ప్రజ్ఞానిని కళాశాల అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

నామని సుజనాదేవికి ప్రోత్సాహక బహుమతి

కమాన్‌చౌరస్తా, మే 11: జిల్లా కేంద్రానికి చెందిన కవి నామని సుజనాదేవికి మాతృ దినోత్సవం సందర్భంగా 'అమ్మకు ప్రేమతో' అనే అంశంపై నిర్వహించిన లేఖలో పోటీలో ప్రోత్సాహక బహుమతికి లభించింది. హన్మకొండకు చెందిన డాక్టర్ మడత భాస్కర్ రెండు తెలుగు రాష్ట్రాల కవులకు మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని లేఖల పోటీ నిర్వహించారు. ఇందుకు 100కు పైగా లేఖలు రాగా, పోటీల ఫలితాలు మాతృ దినోత్సవ సందర్భంగా ఆదివారం ప్రకటించారు. ఇందులో కరీంనగర్‌కు చెందిన భారతీయ జీవిత బీమా సంస్థ ఉద్యోగి నామని సుజనా దేవికి ప్రోత్సాహక బహుమతి లభించింది. ఈ సందర్భంగా పలువురు రచయితలు, సాహితీ వేత్తలు సంతోషం వ్యక్తం చేశారు.

మండల మీ సేవ కార్యవర్గం ఎన్నిక

క